క్లుప్తంగా

భూముల రీ సర్వే



పొలాల్లో సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

వెలుగోడు: మండల పరిధిలోని వేల్పనూరు గ్రామంలో రెవెన్యూ అధికారులు ఫీల్డ్ లెవెల్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రీ సర్వే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. వీఆర్వో వెంకటరమణ, సర్వేయర్ సాయి మాట్లాడుతూ.. సాగులో ఉండి అడంగల్ లో పేరు ఎక్కకున్నా, మిగులు భూమి ఉన్నా, ఆధార్ నంబర్లు, సెల్ నెంబర్లు, వీటిపై ప్రతి సర్వే నెంబరును పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్నామన్నారు. ఈ వెరిఫికేషన్ అనంతరం రైతుల పొలాలను డ్రోన్ల ద్వారా కొలతల వేయనున్నట్లు తెలిపారు. రైతులు తమకు సహకరించాలని వారు కోరారు.

సాధనతో వైకల్యం దూరం

మిడుతూరు: దివ్యాంగ చిన్నారులకు క్రమం తప్పకుండా సాధన చేయించడం ద్వారా వైకల్యం దూరం అవుతుందని ఫిజియోథెరపిస్టు శ్రీధర్ అన్నారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగుల చిన్నారులకు ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళవారం సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంపును దివ్యాంగుల చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు మియ్యాబాషా, షహెనాజ్ పాల్గొన్నారు.

నేడు గరికపాటి ప్రవచనాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ధార్మిక కార్యక్రమాలలో భాగంగా బుధవారం మహాసహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంత్రం 7 నుంచి 8.30 గంటల వరకు ఆదిశంకరాచార్యులు రచించిన శివానందలహరిపై ప్రవచనాలు వినిపించనున్నారు. శివానందలహరిలోని విశేషాలను, శివతత్వాన్ని, శివలీలా మహిమావిశేషాలు తదితర అంశాలను వివరించనున్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం

కొత్తపల్లి: తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం చేకూర్చడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమని ఏఓ మహేష్ అన్నారు. మంగళవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో మినుము పైరులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొలంలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు వల్ల చాలా ఉపయోగం ఉంటుందన్నారు. విచక్షణా రహితంగా రసాయన మందులను పిచికారీ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జాహిద్, వ్యవసాయ సిబ్బంది బాషా తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపరుచుకోండి

మిడుతూరు: గ్రామ సంఘాల పనితీరును మెరుగు పరచుకోవాలని క్లస్టర్ ఏరియా కో–ఆర్డినేటర్ దేగలయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల సమాఖ్య భవనంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్యామలమ్మ అధ్యక్షతన వీఓఏల సమావేశం నిర్వహించారు. ఏరియా కో–ఆర్డినేటర్ మాట్లాడుతూ గ్రామ ఐక్య సంఘాల ద్వారా తీసుకున్న రుణాల రికవరీ శాతం తక్కువ ఉన్న గ్రూపులను గుర్తించి సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సుబ్బయ్య, సీసీలు కృష్ణారెడ్డి, శంకరయ్య, భాను, స్వామినాథం, అకౌంటెంట్ మాధవ్, వీఓఏలు పాల్గొన్నారు.

హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: జాతీయ పౌష్టికాహార సంస్థ నిబంధనలను పాటించని సంక్షేమ హాస్టళ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు దక్క కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పద్మావతికి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో బలమైన ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ వార్డెన్లు స్థానికంగా ఉండకుండా చుట్టం చూపుగా వస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్షవర్ధన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు జెడ్పీహెచ్ఎస్ 8వ తరగతి విద్యార్థి ఉమేష్ చంద్ర అంతర్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచి 3వ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం సుంకన్న తెలిపారు. మంగళవారం ఆ విద్యార్థిని హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ డిసెంబర్ 29 నుంచి 31వ తేదీ వరకు 66వ ఎస్‌జీఎఫ్ఏపీ అంగర్‌జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అండర్–14 విభాగం పోటీలు ప్రొద్దుటూరులో జరిగాయన్నారు. ఇందులో తమ విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచాడన్నారు. విద్యార్థికి తర్ఫీదు ఇచ్చిన పీఈటీ సుమలతను జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి రామలింగేశ్వర రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

హామీని నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్

- ఘనంగా పింఛన్ కానుక వారోత్సవాలు



తుమ్మలూరులో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్న సర్పంచు వరప్రసాదరావు



రేగడగూడురు గ్రామంలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న అంబాల ప్రభాకర్‌రెడ్డి



శ్రీశైలంలో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వెలుగోడు: ఎన్నికల సమయంలో, పాదయాత్రలో పింఛన్‌దారులకు వైఎస్ జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని ఎంపీపీ లాలం రమేష్ అన్నారు. మండలంలో మంగళవారం వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వెలుగోడు పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్ 94 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే రేగడగూడురు గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, దేశం తిరుపంరెడ్డి కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. పింఛన్లు పెంచుకుంటూ పోతామన్న హామీని సీఎం వైఎస్ జగన్ నిలబెట్టుకున్నారని, ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. పింఛన్లు పెంపు కేవలం వద్దులకు మాత్రమే కాదు.. రకరకాల సమస్యలతో బాధపడుతున్న అర్హులైన వాళ్లందరికీ అందుతున్నాయన్నారు. ప్రస్తుతం పింఛన్లను రూ. 2,500 నుంచి రూ.2,750కి పెంచారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లు మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. లంచాలు చెల్లించాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వివక్షకు, అవినీతికి తావు లేకుండా పథకాలు మంజూరు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సులేమాన్, వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు షంషీర్ అలీ, టౌన్ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, మండల ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీలు చికెన్ బాబు, శంకర్ నాయక్, సచివాలయ కన్వీనర్స్ తెలుగు రాజు, నాయకులు పులి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

పాములపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం నడుస్తోందని సర్పంచు వనమాల వరప్రసాదరావు అన్నారు. మంగళవారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో కొత్తగా మంజూరైన 16 మంది లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల పెంపు జరుగుతూనే ఉందన్నారు. అవ్వ, తాతలకు, వికలాంగులు, వితంతువులు అర్హులైన ప్రతి ఒక్కరికి రాజకీయ పార్టీలకతీతంగా పథకాలు మంజూరు చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఎవరి పింఛన్లూ తొలగించలేదు

శ్రీశైలం: శ్రీశైలంలో ఇప్పటి వరకు ఎవరి పింఛన్లూ తొలగించలేదని, ఈనెలలో అదనంగా మరో 33 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు అయ్యాయని శ్రీశైలం సచివాలయం కార్యదర్శి బాలునాయక్, వస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ ఫణినాయక్ తెలిపారు. సచివాలయమ పరిధిలో గతంలో 831 మందికి పింఛన్లు జారీ అయ్యాయని, వీటికి తోడు నూతనంగా మంజూరైన వారికి రూ.2750 అందజేశామన్నారు.

కుమారస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. స్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు,పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములవుదాం

మిడుతూరు: గ్రామ పంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములవుదామని పంచాయతీ కార్యదర్శి శాలుబాషా పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని తలముడిపి గ్రామ సచివాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన గ్రామ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల సిద్దారెడ్డి, ఎంపీటీసీ స్వామన్న పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకటనరసయ్య

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వెంకట నరసయ్య మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అధ్యాపకులు, విద్యార్థులు ఆయనను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని 8 మోడల్ డిగ్రీకళాశాలల్లో ఆత్మకూరు ఒకటని, అలాంటి కళాశాలకు తాను ప్రిన్సిపాల్‌గా రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. నాయీబ్రాహ్మణ సేవా సంఘం క్యాలెండర్‌ను రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. కౌన్సిలరు అల్లూరి కృష్ణ, సంఘం అధ్యక్షుడు దామగట్ల స్వాములు, సభ్యులు లింగమయ్య, నాగశేషులు, రంగస్వామి, వెంకటేశ్వర్లు, తిరుమలేషుల ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి మంగలి షాపునకు రూ.10 వేలు, ఉచిత విద్యుత్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలరు చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మార్చి చివరిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి



హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

పగిడ్యాల: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు మార్చి చివరిలోగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణ, హౌసింగ్ ఏఈ జ్యోతి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామంలో హౌసింగ్ లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిర్మాణాలను పూర్తి చేయకుండా కాలయాపన చేస్తే నష్టపోతారని, మళ్లీ ఇళ్లు మంజూరు కాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భారతి, ఈఓఆర్డీ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్, సచివాలయ కార్యదర్శి మల్లికార్జున, వీఆర్వో వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

వేగవంతం చేయాలి

పాములపాడు: గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని నియోజకవర్గం అభివృద్ధి అధికారి రఘువరన్ సూచించారు. మంగళవారం స్థానిక జగనన్న కాలనీ వద్ద లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణాల్లో పురోగతి పర్వాలేదన్నారు. సమావేశంలో హౌసింగ్ డీఈ ప్రభాకర్‌రావు, ఏఈ శివరామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఏపీఎం అనురాధ, పీఎస్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవ మూర్తి సావిత్రిబాయి పూలే



దామగట్లలో పూలే చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

పగిడ్యాల: సామాజిక విప్లవ మాతృమూర్తి సావిత్రి బాయి పూలే అని ఎంఈఓ సుభాన్ అన్నారు. సావిత్రి బాయి జయంతిని పురస్కరించుకుని మండలంలోని కొత్త పాలమర్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాములపాడు: స్థానిక చౌడేశ్వరీదేవి ఆలయ ఆవరణలో తహసీల్దార్ రత్నరాధిక ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సర్పంచు మేకల బాగ్యమ్మ, ఎంపీడీఓ సుమిత్రమ్మ, డాక్టర్ నాగలక్ష్మి, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ నాగమ్మ, డాక్టర్ నాగన్న, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: స్థానిక మండల రిసోర్స్ భవనంలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఈఓ మౌలాలి ఆధ్వర్యంలో చింతలపల్లి యూపీ స్కూల్ సీనియర్ ఉపాధ్యాయురాలు ఉమామహేశ్వరిని ఘనంగా సన్మానించారు.

నందికొట్కూరు: దామగట్ల పాఠశాలలో సర్పంచ్ మాధవరం సుశీలమ్మ , ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సునీత, ఇన్‌చార్జ్ హెచ్ఎం రెజినా, డీబీఆర్ రాష్ట్ర అధ్యక్షులురాలు జ్యోతి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కురుమూర్తి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

వెలుగోడు: బి.సి.సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘు రాముడు యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వేంపెంట సర్కిల్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆత్మకూరు: పట్టణంలోని మహాత్మాజ్యోతిరావుపూలే విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం శ్రీశైలం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లోకి 35 లక్షల చేప పిల్లల విడుదల



బ్యాక్‌వాటర్‌లో చేప పిల్లలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

పగిడ్యాల: మత్స్యకారుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నెహ్రూనగర్ సమీపాన శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని మత్స్యశాఖ అధికారులు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ చేపల వేటే జీవనాధారంగా జీవిస్తున్న మత్స్యకారులకు అధికారులు సహకరించాలని కోరారు. మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో అధికారుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆర్థికంగా దెబ్బతింటున్నారని చెప్పారు. అలాగే నిషేధిత వలలను వినియోగించకుండా నది పరివాహక గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకునే సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.

వివిధ సీడ్ ఫాంల నుంచి నుంచి చేప పిల్లలు

ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద సుంకేసుల, గాజులదిన్నె, కర్నూలు, అనంతపురం సీడ్ ఫాంల నుంచి 35 లక్షల చేప పిల్లలను తెప్పించి విడుదల చేస్తున్నట్లు నంద్యాల జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు(జేడీఏ) రాఘవరెడ్డి వెల్లడించారు. బ్యాక్‌వాటర్‌లో విడుదల చేసిన ఈ చేప పిల్లలు ఏడాదిలోగా దాదాపు రెండు కిలోల సైజ్‌కు వస్తాయని వాటిని, సంరక్షించుకోవాలని మత్స్యకారులకు సూచించారు. అలివి వలలను లాగకుండా ప్రభుత్వం అనుమతించిన వలలను మాత్రమే వినియోగించాలని జేడీఏ కోరారు. అనంతరం చేప పిల్లలను బ్యాక్‌వాటర్‌లోకి విడుదల చేశారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్యామలమ్మ, ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, ఈఓఆర్డీ పుల్లయ్య, జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, ఎంపీటీసీ చంద్రమోహన్‌నాయుడు, గ్రామ సర్పంచ్ రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై శ్రద్ధచూపాలి



మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే

జూపాడుబంగ్లా: గ్రామాల్లో ప్రజాసమస్యలను పరిష్కరించటంలో అధికారులు శ్రద్ధవహించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని తాటిపాడు గ్రామంలో సర్పంచ్ వంగల లక్ష్మిదేవి అధ్వర్యంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం వారికి మంజూరు చేసిన సంక్షేమ పథకాలను బుక్‌లెట్‌ను అందజేసి వివరించారు. అలాగే రాబోయే రోజుల్లో కూడా మరిన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామమస్తులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులు ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, సీఐ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ మంజులవాణి, ఎంపీటీసీ కృపాకర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మహబూబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు వంగల కృష్ణారెడ్డి, ఉస్మాన్‌బాషా, శివానందరెడ్డి, దేవసహాయం, జంగాలపెద్దన్న, కిరణ్‌కుమార్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ కమిటీ మెంబర్ దిలీప్‌రాజు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరామర్శ

ఐదు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన రైతు ఇద్దూర్‌బాషా కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. మృతుని ఇంటివద్దకు వెళ్లి అతని భార్య షహదాబీ, కుమారుడు షబ్బీర్‌బాషాలను ఓదార్చారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు: పట్టణంలోని కోర్టులో విద్యార్థులకు సీనియర్ సివిల్‌జడ్జి వెంకటేశ్వరరావు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోర్టులో సమస్యలు ఏ విధంగా పరిష్కరిస్తారు. ఏఏ చట్టాల వల్ల ఏఏ ప్రయోజనాలు కలుగుతాయో వివరించారు. న్యాయవాదులు రామ్‌ప్రసాద్, పద్మావతి హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

శివరాత్రిలోపు పనులు పూర్తి చేయాలి



మల్లన్న కన్నీరు వద్ద గోపూజ మందిర నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఫిబ్రవరి 11 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ లోపు క్షేత్ర పరిధిలో చేపట్టిన ఇంజినీరింగ్ పనులన్నీ పూర్తి కావాలని ఈఓ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయల ప్రాంగణం పుష్కరిణి, పంచమఠాల పునఃనిర్మాణం, వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రధానాలయ ప్రాంగణంలో బండపరుపునకు మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ నరసింహారెడ్డి, సహాయస్థపతి జవహర్, ఏఈ ప్రణయ్ పాల్గొన్నారు.

8న చంద్రశేఖర శివాచార్య స్వామి జయంతి

శ్రీశైలం: శ్రీశైలమహాక్షేత్రం పరిధిలో గురుకుల పాఠశాలను స్థాపించి ఎంతో మంది శిష్యులను పూజారులు, పౌరోహితులుగా తీర్చిదిద్దిన చంద్రశేఖర శివాచార్య స్వామి జయంతిని ఈ నెల 8న వేడుకగా నిర్వహిస్తున్నట్లు పాఠశాల ఇన్‌చార్జ్ మల్లికార్జున మంగళవారం తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు పూజలు, తీర్థప్రసాద వితరణ, మధ్యాహ్నం 11.30 నుంచి 1 గంట వరకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5 నుంచి 8 గంటలవరకు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత

- పచ్చనేతలకు అభివృద్ధి కనబడకపోవడం హాస్యాస్పదం
- 'గడప గడపకు మనప్రభుత్వం'లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



బుక్కాపురంలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాలు, నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధి, జగనన్న కాలనీలు... ఇవి అభివృద్ధి కాదా, అభివృద్ధి కనపడలేదంటూ పచ్చనేతలు ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందంటూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మండిపడ్డారు. విద్య, వైద్యానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, విద్య ద్వారానే అందరూ అభివృద్ధి చెందుతారన్నారు. బుక్కాపురం గ్రామంలో మంగళవారం నూతనంగా మంజూరైన 172 పింఛన్లు పంపిణీ, రైతు భరోసా కేంద్రం వద్ద రూ. లక్షతో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అలాగే సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన గోపవరం గ్రామానికి చెందిన కోలా శ్రీనివాసులుకు గ్రామ నాయకుడు అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రూ. 5వేలు ఆర్థిక సాయం అందిచారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ బసిరెడ్డిగారి నాగభూపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వర్‌రెడ్డి, మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీనరసమ్మ, సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ, అల్లీనగరం సర్పంచ్ మద్దుల లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నేతలు కందుల రఘురామిరెడ్డి, కుంచపు శ్రీనివాసులు, కందుల వెంకట సుబ్బారెడ్డి, వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు కుంచపు వెంకటేశం, బాల వెంకటరెడ్డి, బుక్కాపురం ఈశ్వరస్వామి దేవ స్థానం చైర్మన్ యర్రగుంట్ల పెద్ద వెంకట్రాముడు పాల్గొన్నారు.

ఎరువులన్నీ ఆర్‌బీకేల్లోనే

కియోస్కు ద్వారా ఆర్‌బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉంటాయని ఎమ్మెల్యే శిల్పా తెలిపారు. స్థానిక ఆర్‌బీకేలో కియోస్కు యంత్రాన్ని ప్రారంభించారు. ఏడీఏ రాజశేఖర్. ఏఓ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. మహానంది శివారులో తిమ్మాపురం గ్రామానికి చెందిన అర్చకుడు రెంటచింతల రామశర్మ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఈశాని కళ్యాణ మండపాన్ని మంగళవారం ప్రారంభించారు.

కమనీయం.. వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: వెంకటాపురం గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం మంగళవారం అర్చకులు, వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య వందలాదిమందిభక్తుల నడుమ కమనీయంగా జరిగింది. కల్యాణంలో ఉభయదారులుగా వైఎస్సార్‌సీపీ నాయకులు కుందూరుశివారెడ్డి, వెంకటేశ్వరమ్మలు వ్యవహరించి కల్యాణ తంతు జరిపించారు. అంతకు మునుపు దేవాలయంలో మహాసుదర్శన హోమం, పూర్ణాహుతి హోమం క్రతువులను నిర్వహించారు. సాయంత్రం స్వామివారి, అమ్మవార్ల ఉత్సవమూర్తులతో గ్రామోత్సవాన్ని జరిపారు. లక్ష పూలతో స్వామిఅమ్మవార్లను అలంకరించారు. విష్ణుసహస్రనామం, తులసీ అర్చన, మహామంగళహారతి అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.